

బీఈడీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ బీఈడీ కళాశాలల విద్యార్థుల నాలుగో సెమిస్టర్ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఈ పరీక్షలు ఈ ఏడాది ఆగస్టులో జరిగాయి. ఈ సెమిస్టర్‌కు మొత్తం 1,044 మంది హాజరుకాగా 1,009 మంది ఉత్తీర్ణులయ్యారు. 96.65శాతం ఫలితాలు నమోదయ్యాయి. ఫలితాల వివరాలను వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచామని డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు.



మహాల్పాడు వెంచర్ చుట్టూ కంచె కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ స్తంభాలు

సరుకులు కొంటే.. ఇంటి స్థలం ఫ్రీ

"ఇరవై నెలల పాటు కిరాణా సరుకులు కొంటే ఇంటి స్థలం ఉచితంగా ఇస్తాం. రూ.లక్షకు ఇంటి స్థలం కొంటే రూ.70వేల విలువైన స్కూటీ ఫ్రీగా ఇస్తాం".. మహాల్పాడు సమీపాన అనుమతి లేకుండా లేఔట్లు వేసి 'రియల్' వ్యాపారులు ఇస్తున్న బంపర్ ఆఫర్ ఇది. రోజుకొక ఎత్తుగడతో స్థలాలను వారు విక్రయిస్తున్నారు. వీరు ఆక్రమించినవన్నీ ప్రభుత్వ, డీ పట్టా భూములే. ఈ స్థలాలు కొన్నవారు మాత్రం నిలువునా మోసపోతున్నారు. ఇవన్నీ అధికారులకు తెలుసు. అయినా మిన్నకుండిపోతున్నారు. బోర్డులు పెట్టి.. పోలీసులకు ఫిర్యాదు చేశామంటూ చేతులు దులుపుకొంటున్నారు.

- రియల్ ఎస్టేట్ వ్యాపారుల బంపర్ ఆఫర్
- రోజుకొక ఎత్తుగడతో స్థలాల విక్రయాలు
- అవన్నీ ప్రభుత్వ, డీ పట్టా భూములే
- కొనుగోలు చేసి మోసపోతున్న ప్రజలు
- ఆక్రమణలపై ఉదాసీనంగా అధికారులు
- ఉన్నతాధికారుల తీరుపైనా తీవ్ర విమర్శలు

కంచిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):

బతుకుతెరువు కోసం పేదోడు ప్రభుత్వ స్థలంలో చిన్న షాపు పెట్టుకుంటేనో.., నీడ కోసం చిన్న గూడు కట్టుకుంటేనో.. అధికారులు అక్కడ ఆఘమేఘాల మీద వాలిపోతున్నారు. ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తగవంటూ ఆ నిర్మాణాలు తొలగిస్తారు. అటువంటిది సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో.. ఎటువంటి అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ దందా నిర్వహిస్తున్నా.. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. ఆఫర్ల పేరిట ఆక్రమిత స్థలాలు విక్రయిస్తున్నా.. ఉన్నతాధికారులు సైతం ఆ ప్రభుత్వ భూమి ఎలా పోతే.. మాకేంటీ? అన్న చందంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

● కంచిలి మండలం బొగాబెణి పంచాయతీ మహల్పాడు గ్రామ సమీపంలో అనుమతులు లేకుండా రియల్‌ఎస్టేట్ వెంచర్ వేసి, కొందరు అధికారుల అండతో రిజిస్ట్రేషన్‌లు సైతం చేయిస్తున్న వైనంపై పూర్తి ఆధారాలతో ఈ నెల 22న 'ఆంధ్రజ్యోతి'లో 'తహసీల్దార్ చెబితే ఆపాలా?' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులు మాత్రం.. 'ఆక్రమణలు పరిశీలిస్తాం.. చర్యలు తీసుకుంటాం' అంటూ ప్రకటనలకే పరిమితమవ్వడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. మరోవైపు వెంచర్ వేసిన వ్యక్తులు రోజుకో కొత్త ఎత్తుగడలో ఆక్రమించిన స్థలాలను విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. చదును చేసిన ఆ స్థలంపై వివాదాలు నడుస్తున్నా.. తాజాగా చుట్టూ కంచె వేసేందుకు స్తంభాలు ఏర్పాటు చేయడం గమనార్హం. దీనిని బట్టి ఆక్రమణదారులకు అధికారుల అండ ఎంత ఉందో అర్థమవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కొత్త ఎత్తుగడలతో విక్రయాలు..

మహల్పాడు భూముల విక్రయాలకు సదరు ఆక్రమణదారులు కొత్తకొత్త ఆలోచనలతో ముందుకు వెళ్తున్నారు. గతంలో రూ.లక్ష రూపాయలకు ఒక ఇంటి స్థలం కొంటే రూ.70 వేల విలువైన ఎలక్ట్రిక్ స్కూటీ ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. తాజాగా సోంపేటలోని వారి అనుబంధ వ్యాపార భవనం వద్ద మహల్పాడు వెంచర్‌కు సంబంధించి ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. 'ప్రతీ నెలా రూ.5వేలు చొప్పున 20 నెలలు తమ షాపులో కిరాణా సరుకులు కొనుగోలు చేస్తే.. వారికి మహల్పాడులో ఒక ఇంటి స్థలం ఉచితం' అంటూ బోర్డులు పెట్టారు. ఇలా ఉచిత ప్రకటనలు చూసి చాలామంది ఆకర్షితులై స్థలాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.



సోంపేటలో వెంచర్ అనుబంధ దుకాణం వద్ద వెలసిన ఫ్లెక్సీ

ఎందుకీ ఉదాసీనత..

యథేచ్ఛగా ఆక్రమించిన వివాదాస్పద భూములను బహిరంగం విక్రయిస్తున్నా.. అధికారులు మాత్రం ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ భూముల ఆక్రమణలు, అక్రమ వెంచర్‌పై మండలస్థాయి అధికారులు తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాస్థాయిలో ఉన్నతాధికారులు సైతం దీనిపై ఎందుకు దృష్టి సారించడం లేదనే (మిగతా 6వ పేజీలో...)

ఆదర్శం

భళా అజయ్


● డ్రోన్ తయారీలో జిల్లా యువకుడు



అజయ్ కుమార్

కోటబొమ్మాళి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విజయవాడలో రెండు రోజులుగా నిర్వహించిన డ్రోన్ కెమెరా తయారీలో కోటబొమ్మాళి మండలం దంత గ్రామానికి చెందిన శిమ్మ అజయ్‌కుమార్ పాల్గొని మూడో స్థానం సాధించాడు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా రూ.లక్ష నగదు బహుమతి అందుకున్నాడు. అజయ్‌కుమార్ తల్లిదండ్రులు శిమ్మ జగన్నాథరావు, లక్ష్మి వ్యవసాయ కూలీలు. దంత ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి వరకు చదివాడు. ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌లో పాలిటెక్నికల్, లఖిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్‌లో ఇంజనీరింగ్ పూర్తిచేసి 2019లో డ్రోన్ తయారీలో నైపుణ్యం సాధించాడు. 'సుమారు రూ.10లక్షలు వెచ్చించి.. 40 కేజీలు బరువున్న 100మీటర్లు దూరం ప్రయాణం చేసే డ్రోన్‌ను తయారు చేశా. భారతదేశంలో మొదటి డ్రోన్ హెలీకాప్టర్ 3డీ ప్రింటెండ్ టెక్నాలజీ ఉపయోగించా. నా లక్ష్యం నెరవేరడానికి ఆరేళ్లు పట్టింద'ని అజయ్‌కుమార్ తెలిపాడు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్‌కు పలువురు అభినందనలు తెలియజేశారు.

దానా అలజడి



- నేడు, రేపు జిల్లాకు భారీ వర్ష సూచన
- తీరప్రాంతంలో ఈదురుగాలులు ఆరంభం
- ఇచ్ఛాపురం నియోజకవర్గంపై తీవ్ర ప్రభావం
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- కలెక్టరేట్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూంలు

శ్రీకాకుళం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుఫాన్.. ఎటువంటి బీభత్సం సృష్టిస్తుందోనని జిల్లావాసులు భయాందోళ చెందుతున్నారు. గురువారం ఒడిశాలో తుఫాన్ తీరం దాటనుంది. తుఫాన్ ప్రభావం జిల్లాపై ఎక్కువగా చూపనుందని.. ఇప్పటికే వాతావరణ శాఖ అంచనా వేసింది. గురువారం బలమైన ఈదురుగాలులు.. గంటకు 80 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని వెల్లడించింది. దీంతో జిల్లా అధికారులను కలెక్టర్ స్వప్నిల్ (మిగతా 6వ పేజీలో...)

● రణస్థలం మండలం కొవ్వాడ నుంచి ఇచ్ఛాపురం మండలం డొంకూరు సముద్రతీరం వరకు బుధవారం సాయంత్రం నుంచీ ఈదురుగాలులు ఆరంభమయ్యాయి. సముద్రంలో కెరటాలు ఎగసిపడుతున్నాయి. తుఫాన్ నేపథ్యంలో ప్రధానంగా ఉద్దానం ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తితలీ తుఫాన్ సృష్టించిన బీభత్సాన్ని ఇప్పటికీ మరచిపోలేకపోతున్నారు. ఏటా ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఈ తుఫాన్ ఎటువంటి విషాదాన్ని మిగుల్చుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

రైతుల్లో ఆందోళన

హిరమండలం/ జలుమూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దానా తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతుల్లో అలజడి రేగుతోంది. గురువారం నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో హిరమండలం, జలుమూరు తదితర మండలాల్లో వరి పంట కోత దశకు చేరుకుంది. ఈ సమయంలో తుఫాన్ వస్తే.. తమకు పంట నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.25వేలకు పైగా ఖర్చు చేశామని.. పంట చేతికి అందివచ్చే సమయంలో తుఫాన్ ముప్పు వెంటాడుతోందని ఆవేదన చెందుతున్నారు.



హిరమండలం: కోత దశలో వరిపంట

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నెంబర్ : 08942-240557

సమాచారం

నేడు, రేపు రైళ్లు రద్దు

పలాస, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా ఈ నెల 24, 25 తేదీల్లో ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో అనేక రైళ్లు రద్దు చేసినట్లు రైల్వేశాఖ పీఆర్వో నుంచి బుధవారం ఓ ప్రకటన విడుదలైంది. 24న కటక్-పారాదీప్ స్పెషల్, భువనేశ్వర్ -ముంబాయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-ఆనంద్‌విహార్ ఎక్స్‌ప్రెస్, పూరీ-షాలీమార్, న్యూఢిల్లీ- భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్, బెంగుళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ రద్దు కానున్నాయి. 25న పారాదీప్-పూరీ ఎక్స్‌ప్రెస్, చెన్నై-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్, షాలీమార్-పూరీ, భద్రక్-ఖరగ్‌పూర్ స్పెషల్ రైళ్లను రద్దు చేసినట్టు ప్రకటనలో తెలిపారు.

రైల్వే హెల్ప్ డెస్క్ ఏర్పాటు

ఆమదాలవలస, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రోడ్డు(ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. దానా తుఫాన్ ప్రభావంతో ఈ నెల 24, 25, 26 తేదీల్లో అటు భువనేశ్వర్, ఇటు విజయవాడ వైపు వెళ్లే 51 రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు వెల్లడించారు. రైల్వే ప్రయాణికులకు ఎటువంటి సమాచారం కావాలన్నా హెల్ప్‌లైన్ డెస్క్ సిబ్బందిని లేదా.. టోల్‌ఫ్రీ **08942- 286213, 85912 85913** నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

వర్షం వస్తే... తలదాచుకొనేదెలా?



- శిథిలావస్థలో తుఫాన్ రక్షిత భవనాలు
- పాఠశాలలే దిక్కు

హరిపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మందస మండలం **టీ గంగువాడలోని తుఫాన్ షెల్టరు** దుస్థితిది. శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కూలిపోతోందో తెలియని పరిస్థితి. టీ గంగువాడ గ్రామం తీరానికి కేవలం అర కిలోమీటరు దూరంలో ఉండటంతో తుఫాన్ హెచ్చరిక చేస్తే.. గ్రామస్థుల గుండెలదురుతున్నాయి. భారీ వర్షాలు కురిస్తే ఎక్కడ తలదాచు కోవాలో తెలియక వారు ఆందోళన చెందుతున్నారు. గత ఐదేళ్లుగా కనీస నిర్వహణ లేక జిల్లాలో చాలాచోట్ల తుఫాన్ షెల్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


6లో

ఆత్మవిశ్వాసమే తోడుగా..

- పోలియోను జయించి... జీవితంలో ముందుకు సాగుతున్న వైనం
- ఉపాధ్యాయ వృత్తిలో స్ఫూర్తిగా నిలుస్తున్న సోమశేఖర్
- నేడు ప్రపంచ పోలియో నివారణ దినం

పొందూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చిన్నతనంలో పోలియో సోకినా... ధైర్యంగా ముందుకు సాగుతూ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించి...స్ఫూర్తిగా నిలుస్తున్నారు పొందూరు పట్టణానికి చెందిన అనకాపల్లి సోమశేఖర్. స్థానిక జంగాలవీధికి చెందిన చెందిన అప్పారావు, సిమ్మన్నల కుమారుడు సోమశేఖర్‌కు చిన్నతనంలోనే పోలియోతో రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. తల్లిదండ్రులు ఇచ్చిన ధైర్యం.. ప్రోత్సాహంతో ఇంటర్ వరకు పొందూరు ప్రభుత్వ కళాశాలలో చదువుకున్నాడు. వమరవిల్లి డైట్ కళాశాలలో డీఎడ్ పూర్తి చేశాడు. తరువాత ఓపెన్‌స్కూల్ విధానంలో ఎమ్మెస్సీ బీఈడీ పూర్తి చేశారు. 2008 డీఎస్సీలో ఓపెన్ కేటగిరీలోనే ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యారు. సోమశేఖర్‌కు భార్య లీలావతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రస్తుతం ఆయన పొందూరులో విధులు నిర్వహిస్తున్నారు.

.. ఇలా జిల్లాలో చాలా మంది పోలియో వ్యాధి బాధితులు ఆత్మవిశ్వాసంతో సమస్యలు అధిగమిస్తూ.. జీవితంలో రాణిస్తున్నారు. గురువారం 'ప్రపంచ పోలియో నివారణ దినం' సందర్భంగా.. పోలియోను జయించి.. వివిధ రంగాల్లో స్ఫూర్తిగా నిలుస్తున్న వారిపై ప్రత్యేక కథనాలు..



సోమశేఖర్

6లో



మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

బాలికలపై అత్యాచార ఘటనలో

ముగ్గురి అరెస్టు

- ఫోక్సో కేసు నమోదు
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పుట్టినరోజు వేడుక పేరుతో ఇద్దరు బాలికలపై ఇటీవల అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు నిందితులను కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వివరాలు వెల్లడించారు. 'పలాసకు చెందిన రాజమహేంద్ర సాయి అనే యువకుడు ఈ నెల 19న తన పుట్టిన రోజు సందర్భంగా స్నేహితులైన రాధామోహన్‌రావు, పైల శివతో కలిసి పార్టీకి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. శివ కారు డ్రైవర్. తనకు తెలిసిన వ్యక్తి వద్ద కారు తీసుకుని.. ఆ ముగ్గురితోపాటు సాయి స్నేహితురాలైన ఇద్దరు బాలికలను తీసుకుని పార్టీకి వెళ్లారు. జగనన్న కాలనీలోని ఓ ఇంట్లో వేడుకలు చేసుకున్నారు. ఆ ముగ్గురు (మిగతా 6వ పేజీలో...)

ఆత్మవిశ్వాసమే తోడుగా..

● పోలియోను జయించి...
జీవితంలో ముందుకు సాగుతున్న వైనం

నేడు ప్రపంచ పోలియో నిర్మూలన దినం

ఆత్మవిశ్వాసం... ఇది తోడుంటే ఎలాంటి సమస్యనైనా అధిగమించవచ్చని పెద్దలు చెబుతుంటారు. ఈ మాటను ఎంతవరకూ విశ్వసించవచ్చు అనే సందేహాలు ఎవరికైనా ఉంటే...ఆ యోధులను చూస్తే అర్థమవుతుంది. ఆ యోధులు జీవిత యుద్ధంలో గెలిచిన వారు. పోలియో వ్యాధి తమను నడవకుండా చేయాలని ప్రయత్నిస్తే... ఆత్మవిశ్వాసం వారిని ముందుకు నడిపించి.. గెలిపించింది. గురువారం 'ప్రపంచ పోలియో నివారణ దినం'. ఈ నేపథ్యంలో పోలియోను జయించి.. వివిధ రంగాల్లో రాణిస్తున్న వారి స్ఫూర్తిదాయక కథనాలను తెలుసుకుందాం రండి.



పోలియోతో చేతులను కూడా కాళ్లుగా చేసి నడుస్తున్న శ్రీనివాసరావు

సంకల్పమే బలమని...

కోటబొమ్మాళి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి గ్రామానికి అధికారులు... ప్రజాప్రతినిధులు ఎప్పుడైనా వెళ్లినప్పుడు ఓ వ్యక్తి కోసం చుట్టూ చూస్తారు. ఎందుకంటే అతిథులను వేదిక మీదకు పిలిచేది.. సభను నడిపించేదీ ఆయనే. ఆత్మ విశ్వాసానికి ప్రతీకలా.. నిత్యం హుషారుగా కనిపించే ఆ వ్యక్తి పేరు రత్నాల శ్రీనివాసరావు. పుట్టుకతోనే పోలియో బారిన పడిన శ్రీనివాసరావు నడవలేడు. కానీ వైకల్యం తనకు అడ్డు రాదంటాడు. గ్రామంలో జరిగే కార్యక్రమాలన్నిటిలోనూ ముందుంటాడు. సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటాడు. చేతులను కూడా కాళ్లుగా మలుచుకొని... తన సమస్యను మర్చిపోయానన్నాడు. మన సంకల్పం గట్టిగా ఉన్నప్పుడు అంగవైకల్యం ఏమీ చేయలేదంటాడు. డిగ్రీ వరకు చదివిన తాను తల్లిదండ్రుల ఆర్థిక ఇబ్బందుల కారణంగా... విద్యాపరంగా ముందుకు వెళ్లలేకపోయానని నిరాశ వ్యక్తం చేస్తాడు. కానీ సమాజంలో గుర్తింపు పొందేలా ఏదో ఒకటి చేయాలనే సంకల్పంతో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని అంటున్నాడు. విద్యార్థులకు ట్యూషన్లు చెప్పడం ద్వారా వచ్చే కొద్ది మొత్తంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నానని చెబుతున్నాడు. ఇటీవల భవిత కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గ్రామానికి వచ్చారు. శ్రీనివాసరావు చురుకుదనాన్ని గుర్తించి...అతనితోనే రిబ్బన్ కట్ చేయించడం గమనార్హం. శ్రీనివాసరావుకు తల్లిదండ్రులతో పాటు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తోటి వారికి దారి చూపాలని..!

ఎచ్చెర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పుట్టుక తోనే పోలియో వ్యాధి బారిన పడిన ఆయన ఏనాడూ దిగులు చెందలేదు. ధైర్యంగా ముందుకు నడవడమే కాకుండా తనలాంటి ఎంతో మందికి తోడుగా నిలుస్తున్నారు ఎచ్చెర్ల మండలం ఎస్ఎంపురంపేట (మెట్టపేట) గ్రామానికి చెందిన గురుగుబెల్లి సహదేవుడు. పదో తరగతి ఉత్తీర్ణుడైన ఆయన తొలుత ఉద్యోగ ప్రయత్నం చేశారు. ప్రభుత్వ ఉద్యోగం రాకపోయినప్పటికీ ఆందోళన చెందకుండా ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లో సొంతంగా ఓ టీ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 1994లో చిలక పాలెం-పొందూరు రోడ్డులో 60 మంది దివ్యాంగులకు ఇళ్ల పట్టాల కేటాయింపు... ఐఏవై ఇళ్లు మంజూరు చేయించడంలో ప్రధాన భూమిక పోషించారు సహదేవుడు. 2008లో ఎస్ఎంపురం రెవెన్యూ పరిధిలో 30 మంది దివ్యాంగులకు ఒక్కో ఎకరా వంతున కొండ పోరంబోకు భూమి కేటాయింపులో ఆయన కీలక పాత్ర పోషించారు. ఇటీవలనే ఈ భూమిలోకి వెళ్లేందుకు వీలుగా అధికారులను ఒప్పించి రోడ్డును వేయించుకున్నారు. గతంలో జిల్లా దివ్యాంగుల అసోసియేషన్‌కు ఉపాధ్యక్షునిగా చురుకుగా పని చేశారు. ఇప్పటికీ దివ్యాంగుల కోసం ఏదో చేయాలన్న తపనతో ముందుకు సాగుతున్నారు. సహదేవుని భార్య గృహిణి. కుమారుడు శ్రీనివాసరావు టీసీఎస్ కంపెనీలో పని చేస్తున్నాడు. కుమార్తె జ్యోతి జిరాక్స్ ఇంటర్నెట్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు.



తమకు కేటాయించిన భూమికి రోడ్డు వేస్తున్న సందర్భంగా సహదేవుడు తదితరులు



పాఠశాలలో పిల్లలకు పాఠాలు బోధిస్తున్న జ్యోతి

అక్షర 'జ్యోతి' వెలిగిస్తూ!

నరసన్నపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చిన్నతనంలో పోలియో సోకినా.. ఏ మాత్రం బాధ పడకుండా.. మనోస్థైర్యంతో ముందడుగు వేస్తూ.. విజ్ఞాన జ్యోతులను వెలిగిస్తున్నారా ఉపాధ్యాయిని. ఆమె రెడ్డికపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని కె.జ్యోతి. ఆ విజయగాథ ఆమె మాటల్లోనే.. 'మా స్వగ్రామం టెక్కలి. చిన్నతనంలో పోలియో సోకింది. నాన్న, అమ్మ చిన్నతనంలో నా పరిస్థితి చూసి కొంతవరకు బాధపడ్డారు. పంచాయితీరాజ్‌లో నాన్న చిరుద్యోగి. అన్నయ్యను, ఇద్దరు అక్కలను, నన్ను ప్రభుత్వ ఉద్యోగులుగా చూడాలనేది నాన్న ఆశయం. అందరం నాన్న ఆశయం కోసం కసితో చదివాం. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాం. అంగవైకల్యం అనేది.. లక్ష్య సాధనకు అడ్డు కాదు. శారీరక వైకల్యం కంటే.. మానసిక వైకల్యం చాలా ప్రమాదం. 2002లో ఉపాధ్యాయ వృత్తిలో చేరాను. వివిధ ప్రాంతాల్లో సేవలందించాను. పోలియో సోకిందని బాధ పడకుండా ముందడుగు వేయాలి. ప్రభుత్వాలు దివ్యాంగులను ఆదుకోవడం కూడా కొంత బాగుంద'ని జ్యోతి తెలిపారు.

ఇద్దరూ కలసి నడుస్తూ!

రణస్థలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు వారివి. ఇద్దరివీ వేర్వేరు గ్రామాలు. కానీ సమస్య ఒక్కటే. మూడేళ్ల వయసులోనే వారిపై విధి కన్నెర్ర చేసింది. పోలియో రూపంలో దాడి చేసింది. ఫలితంగా రెండు కాళ్లూ కుంటుపడ్డాయి. అయినప్పటికీ వారు నిరాశ చెందలేదు. ఒకరు పదో తరగతి.. ఇంకొకరు ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. వారే నగరప్పాలెం గ్రామానికి చెందిన మంత్రి ఏసుబాబు, వెంకటరావుపేటకు చెందిన గురాన పైడినాయుడు. ప్రభుత్వ సాయంతో ఇద్దరూ కలసి మండల కేంద్రంలో ఇంటర్‌నెట్ సెంటర్, ఫొటో స్టూడియో పెట్టుకొని జీవితాన్ని వెళ్లబుచ్చుతున్నారు. గట్టి సంకల్పం ఉంటే..వైకల్యం ఏమీ చేయలేదని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా ఇద్దరూ కలసి వ్యాపారం చేస్తున్నారు. ఏసుబాబుకు సంతోషి అనే అమ్మాయితో వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం.



జిరాక్స్ తీస్తున్న ఏసుబాబు, పైడినాయుడు

స్ఫూర్తిగా నిలుస్తూ...

సరుబుజ్జిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి గ్రామానికి చెందిన బండి చిన్నారావు సాధారణ రైతు కుటుంబంలో 1981లో జన్మించారు. 8 నెలల వయస్సులో పోలియో వ్యాధి బారిన పడి రెండు కాలు చచ్చుబడిపోయాయి. తల్లిదండ్రుల సాయంతో వైకల్యాన్ని అధిగమించాడు. చదువులో రాణిస్తూ బీఈడీ పూర్తి చేశాడు. తొలుత కాంట్రాక్ట్ లెక్చరర్‌గా, విద్యావలంటీర్‌గా పనిచేశాడు. 2012 నుంచి సాక్షర భారత్ కో-ఆర్డినేటర్‌గా.. మండల విద్యాశాఖ కార్యాలయంలో సీఆర్ఎంటీగా విధులు నిర్వహిస్తున్నాడు. ఉన్నత పరీక్షలకు వెళ్లేవారికి తనవంతుగా ప్రోత్సహిస్తున్నాడు. తన తమ్ముడు వెంకటరమణను టీచర్‌గా, అక్క కుమార్తెలు పద్మ, రోజాలు సచివాలయ ఉద్యోగులుగా... అన్న కుమారుడు శ్యామలరావును పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించడంలో చిన్నారావు సలహాలు కీలక పాత్ర పోషించాయి. పూర్తిస్థాయిలో దివ్యాంగుడైన తాను ప్రభుత్వ ఉద్యోగం సాధించలేకపోయానని... నకిలీ దివ్యాంగులు అధికం కావడంతో ప్రభుత్వ ఉద్యోగం సాధించడంలో విఫలమయ్యాననే బాధ కొంత ఉందని... అయినా మానసిక స్థైర్యం కోల్పోవడం లేదని చెబుతున్నాడు చిన్నారు.



చిన్నారావు

కార్పెంటర్ వృత్తి ఆధారంగా...

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చినడోకులపాడు గ్రామానికి చెందిన బత్తిన నీలకంఠానికి 12 ఏళ్ల వయస్సులోనే పోలియో సోకడంతో రెండు కాళ్లూ పనిచేయడం మానేశాయి. అతనికి కాళ్లు పని చేయవని వైద్యులు స్పష్టం చేయడంతో కుటుంబ సభ్యులు ఎంతో కుంగిపోయారు. కానీ అతను మాత్రం అధైర్య పడకుండా.. కార్పెంటర్ వృత్తిని నేర్చుకొని సొంతంగా పనులు చేయడం ప్రారంభించాడు. అతని నైపుణ్యాన్ని చూసి చుట్టుపక్కల వారు ప్రోత్సహించారు. యంత్రాలు కొనుగోలు చేసి... మరి కొంతమందికి ఉపాధి కల్పించాడు. పెళ్లి చేసుకొని..భార్య తోడుగా నిలవడంతో నీలకంఠం మరింత బిజీగా మారిపోయాడు. తన ఇద్దరు కుమార్తెలకు వివాహాలు చేయించాడు. కొంతమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాడు. ప్రభుత్వం వికలాంగులకు అందిస్తున్న మూడు చక్రాల మోటారు వాహనానికి దరఖాస్తు చేసినా అధికారులు కనికరించలేదని... దీంతో ఫైనాన్స్‌లో వాహనం కొనుక్కున్నట్టు చెప్పాడు. తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయ పనులు కూడా చేస్తుంటానని చెప్పాడు.



కార్పెంటర్ పనిలో నిమగ్నమైన నీలకంఠం

ఉచిత వ్యాక్సిన్ వేస్తున్నాం..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రభుత్వం సరఫరా చేసిన పోలియో వ్యాక్సిన్‌ను ఉచితంగా వేస్తున్నాం. శతశాతం పిల్లలకు పుట్టినప్పటి నుంచి ఐదేళ్ల మధ్య వయసు వరకు ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. జిల్లాలో ఎటువంటి కేసులు లేవు. ఇప్పుడు పోలియో చుక్కల మందుతో పాటు ఇంజక్షన్ కూడా వేస్తున్నాం.

-డాక్టర్ సత్యవాణి,
జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

తలదాచుకోనేదెలా?

● తుఫాన్ల సమయంలో పాఠశాలలే దిక్కు
● నిర్వహణ కరువైన షెల్టర్లు
● అత్యవసర సమయంలో ఉపయోగపడని దుస్థితి
● అధిక శాతం భవనాలు శిథిలావస్థలోనే..

● మందస మండలం సరియాపల్లి గ్రామంలోని తుఫాన్ షెల్టరు నిర్వహణ లేకపోవడం... లోపల గదులు వినియోగంలో లేకపోవటంతో వరండాను ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. దీంతో తుఫాన్ల సమయంలో హరిపురంలోని పాఠశాల భవనాలే దిక్కవుతున్నాయి.

హరిపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో తక్కున గుర్తుకు వచ్చేవి తుఫాన్ షెల్టర్లు. లోతట్టు ప్రజానీకాన్నీ రక్షించే ఉద్దేశంతో నిర్మించినవి. కానీ అవి ఏమాత్రం ఉపయోగపడే స్థితిలో లేవు. తుఫాన్ సమయంలో వీచే భారీ గాలులకు... ముందుగా అవే పడిపోయేలా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం కనీసం వీటి వైపు కన్నెత్తి చూడకపోవడంతో నిర్వహణ కరవై శిథిలావస్థకు చేరుకున్నాయి. కనీస స్థాయిలో మరమ్మతులు చేపడితే సగానికి పైగా షెల్టర్లు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. కానీ ఆ దిశగా ప్రయత్నాలు జరగడం లేదు. జిల్లా వ్యాప్తంగా తీరప్రాంత గ్రామాల్లో సుమారు 144 వరకు తుఫాన్ షెల్టర్లు ఉన్నాయి. వాటిలో సుమారు 35 వరకు పూర్తిగా వినియోగానికి పనికిరాని దుస్థితిలో ఉన్నాయి. దీంతో పాటు మరో 60 వరకు భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని భవనాలకు తలుపులు, కిటికీలు లేవు. మరికొన్ని పూర్తిగా బీటలు వారి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి. మరికొన్ని చోట్ల ప్రైవేటు పనులు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఈ శిథిల భవనాల్లోనే కొనసాగిస్తున్నారు. అధికారులు ఏడేళ్ల కిందట ఒక్కో భవనానికి రూ.20 వేల చొప్పున వెచ్చించి... మరమ్మతులు చేపట్టామని... అన్నీ బాగానే ఉన్నాయని చెబుతున్నారు. ఫైలీన్, లెహర్, హుద్‌హుద్, తితలీ తుఫాన్ల సమయంలో మందస, కవిటి, కంచిలి, పలాస, వజ్రపుకొత్తూరు, గార వంటి తీరప్రాంత మండలాల్లో చాలా చోట్ల పాఠశాలలు, హాస్టల్ భవనాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లోకి ప్రజలను తరలించడాన్ని బట్టి తుఫాన్ రక్షిత భవనాలు ఏమేరకు ఉపయోగపడుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.



నిరుపయోగంగా మారిన లక్ష్మీపురం తుఫాన్ భవనం



కేంద్రాల్లో తలదాచుకుంటున్న మత్స్యకారులు (ఫైల్)

దారుణ స్థితిలో...

మందస మండలంలో మొత్తం 11 తుఫాన్ రక్షిత భవనాలు ఉన్నాయి. రట్టి, బేతాళపురం, మీల గంగువాడ, టి.గంగువాడ, లక్ష్మీపురం, దున్నూరు, బహాడపల్లి, సరియాపల్లి, గెడ్డూరు, సిగలపుట్టుగ, బిడిమి గ్రామాల్లో వీటిని నిర్మించారు. వీటిలో సగానికిపైగా భవనాలు శిథిలమై... వినియోగంలో లేకపోగా, మరికొన్ని భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ డిపోలు, పాఠశాలలు నడుపుతున్నారు. ఎం .గంగువాడ, రట్టి, బహాడపల్లి, గెడ్డూరులోని భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. బేతాళపురం, సరియాపల్లిలో పాఠశాలలు నడుపుతున్నారు. ఎం.గంగువాడలో రేషన్‌డిపో, బహాడపల్లిలో పాఠశాల వంట భవనంగా ఉపయోగిస్తున్నారు. వీటి మరమ్మతుల కోసం ఏడేళ్ల కిందట రూ.6 లక్షలు విడుదలయ్యాయి. ఈ నిధులతో పనులు చేపట్టి వినియోగంలోకి తెచ్చినా... నాటినుంచి వైసీపీ ప్రభుత్వం వీటి ఆలానా, పాలనా పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయని గ్రామస్తులు చెబుతున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

దానా.. అలజడి

(ఐదో పేజీ తరువాయి) దినకర్ పుండ్కర్ అప్రమత్తం చేశారు. కలెక్టరేట్‌తోపాటు ప్రతి మండల కేంద్రంలోనూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయించారు. తుఫాన్ చర్యలపై బుధవారం సాయంత్రం అధికారులతో సమీక్ష నిర్వహించారు.

● 1,004 చెరువుల గట్లు బలహీనం...

జిల్లావ్యాప్తంగా ఐదువేలకుపైగా చెరువులు ఉన్నాయి. ఇందులో 1,004 చెరువుల గట్లు బలహీనంగా ఉన్నాయని అధికారులు కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. తుఫాన్ కారణంగా భారీవర్షాలతో చెరువు గట్లు పాడైతే.. వెంటనే చర్యలు చేపట్టేందుకు ఇసుక బస్తాలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు కలెక్టర్ సూచించారు. కంట్రోల్‌రూమ్‌లో ఉండే సిబ్బంది.. వారికి అందిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు చేరవేయాలని ఆదేశించారు. అలాగే ప్రత్యేకంగా నియోజకవర్గానికి ఇద్దరు, తీరప్రాంత మండలానికి ఒకరు చొప్పున అధికారులు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తూ.. స్థానిక పరిస్థితులను ఫోన్‌లో తెలుసుకోవాలని స్పష్టం చేశారు.

● డ్రోన్లతో పర్యవేక్షణ..

తుఫాన్ తీరం దాటాక.. భారీవర్షాలు రెండు రోజులు కురుస్తాయని.. పైగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సోంపేట, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి మండలాలపై ఎక్కువగా ప్రభావం ఉంటుందని నివేదికలో వెల్లడైంది. దీంతో ఆయా మండలాల్లో అధికారులను కలెక్టర్ అప్రమత్తం చేశారు. ప్రజలందరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అవసరమైతే కంట్రోల్‌రూమ్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి రెండు గంటలకు ఇచ్ఛాపురం నియోజకవర్గం గురించి ప్రత్యేక బులిటెన్ విడుదల చేయనున్నారు. తీరప్రాంత మండలాల్లో తుపాను ప్రభావాన్ని.. నష్టాన్ని గుర్తించేందుకు.. ఇరవై డ్రోన్లను సిద్ధం చేశారు. సమాచారాన్ని ఎప్పటికప్పుడు గూగుల్ షీట్స్‌లో నమోదు చేసేలా ఏర్పాటు చేపట్టారు.

● ఇప్పటికే రైళ్లు రద్దు..

ఒడిశా, పశ్చిమబెంగాళ్ నుంచి జిల్లా మీదుగా.. రాకపోకలు సాగించే రైళ్లను గురువారం రద్దు చేశారు. రెండు రోజుల భారీవర్షాల కారణంగా రైలు లైన్‌లు పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలు దిగాయి. అలాగే నాగావళి, వంశధార, బహుదా నదులు.. సాగునీటి చెరువులు... సముద్ర తీరప్రాంతాల వద్ద ప్రజలు వెళ్లకుండా హెచ్చరికలు జారీఅయ్యాయి. తుఫాన్ రక్షణ చర్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడారు. ప్రజలకు ఏవిధమైన నష్టం కలగకుండా.. సకాలంలో సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎస్ఈఐఏఏ సభ్యురాలిగా బీఆర్ఏయూ రిజిస్ట్రార్

ఎచ్చెర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ (స్టేట్ లెవెల్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంటు అథారిటీ- ఎస్ఈఐఏఏ) వాతావరణ మార్పులపై తగిన సూచనలు సలహాలు ఇచ్చేందుకు రాష్ట్రస్థాయిలో నియమించిన కమిటీలో సభ్యురాలిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో ఛైర్మన్, సెక్రటరీ, సభ్యులు మొత్తం 15 మంది ఉంటారు. భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ వాతావరణ మార్పులు మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఈ కమిటీ పనిచేస్తుంది. సభ్యురాలిగా మూడేళ్ల పాటు ఈమె కొనసాగనున్నారు.

బీఆర్ఏయూ ఎస్వోగా సామ్రాజ్యలక్ష్మి

ఎచ్చెర్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రత్యేకాధికారి (ఎస్వో)గా డాక్టర్ కె.సామ్రాజ్య లక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. వర్సిటీలోని పాలనా, ఆర్థిక, పరీక్షల సంబంధిత అంశాలను ఈమె పర్యవేక్షించనున్నారు. గతంలో ఈమె ఏయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా, జాయింట్ రిజిస్ట్రార్‌గా, ఫైనాన్స్ అధికారిగా, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా పనిచేశారు. ఆర్జీయూకేటీ (నూజివీడు)లో ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా వ్యవహరించారు. కా గా, వర్సిటీ ఎస్వోగా బాధ్యతలు స్వీకరించిన సామ్రాజ్య లక్ష్మిని వీసీ కేఆర్ రజని, రెక్టార్ బి.అడ్డయ్య, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ యు.కావ్యజ్యోత్స్న, ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ అభినందనలు తెలిపారు.

సరుకులు కొంటే.. ఇంటి స్థలం ఫ్రీ

(ఐదో పేజీ తరువాయి) సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేని ఈ వెంచర్‌ను అప్పటి కంచిలి తహసీల్దార్, పలాస ఆర్డీవో భరత్‌నాయక్ పరిశీలించారు. ఈ స్థలాలు కొనుగోలు చేయొద్దని, రిజిస్ట్రేషన్లు చేయరాదని బోర్డులు ఏర్పాటు చేసి.. గ్రామాల్లో దండోరా వేయించారు. కొన్నాళ్లు స్తబ్దత పాటించిన ఆక్రమణదారులు.. ఆ అధికారుల బదిలీ తర్వాత మళ్లీ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆఫర్ల పేరిట అక్రమ వెంచర్‌లో స్థలాలను విక్రయిస్తూ అటు ప్రభుత్వానికి.. ఇటు కొనుగోలుదారులను మోసగిస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి ఉన్నతాధికారులు స్పందించి.. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల చెరను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తప్పవు..

మహల్పాడు వెంచర్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమించినట్టు రుజువైతే అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం. అధికారులతో కలిసి ఆ స్థలాన్ని పరిశీలిస్తాం. గత ఆర్డీవో భరత్‌నాయక్ సూచనల మేరకు అప్పటి తహసీల్దార్ వై.జయలక్ష్మి.. ఆ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆ బోర్డులపై గుర్తు తెలియని వ్యక్తులు రంగులు వేసినట్టు సమాచారం అందింది. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాం.

-రమేష్ కుమార్, తహసీల్దార్, కంచిలి

బాలికలపై అత్యాచార ఘటనలో ముగ్గురి అరెస్టు

(ఐదో పేజీ తరువాయి) యువకులు మద్యం సేవించి.. ఇద్దరి బాలికలపై అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం వారిని అదేకారులో ఇంటి వద్ద విడిచిపెట్టి వెళ్లిపోయారు. ఓ బాలిక జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పగా.. తొలుత పరువు పోతుందని భయపడి విషయాన్ని దా చారు. 21న బాలిక తల్లి కాశీబుగ్గ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎ స్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఐ మోహనరావు ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశా రు. విచారణ ఆ ముగ్గురు యువకులు నేరం అంగీకరించడంతో.. బుధవారం వారిని అరె స్టు చేసి కోర్టులో హాజరుపరిచామ'ని ఎస్పీ తెలిపారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ (క్రైం) పి.శ్రీనివాసరావు, కాశీబుగ్గ సీఐ దాడి మోహన్‌రావు ఎస్బీ సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు పాల్గొన్నారు.

గంజాయి అరికట్టేందుకు చర్యలు తీసుకోండి

● నేర సమీక్షలో ఎస్పీ మహేశ్వరరెడ్డి





మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, హాజరైన పోలీసు అధికారులు, సిబ్బంది

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) జిల్లా గంజాయి రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా ఫిర్యాదులు, ఎస్సీపీఎస్, సైబర్, ఎన్బిడబ్ల్యూ, ప్రాపర్టీ, మహిళలపై జరుగుతున్న నేరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రధానంగా చెక్ పోస్టుల వద్ద పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. రైల్వే, బస్ స్టేషన్లలో జాగిలాలతో ఎప్పటికప్పుడు సోదాలు చేపడుతుండాలన్నారు. 1930 సైబర్ పోర్టల్ ద్వారా నమోదైన కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల నివారణలో భాగంగా స్కూల్స్, కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. 2023కి ముందు ఉన్న కేసుల ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచి ఎటువంటి అల్లర్లు జరగకుండా చూడాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సమావేశంలో ఏఎస్పీ పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, ప్రసాదరావు, పరిపాలనాధికారి సీహెచ్ గోపీ నాథ్, సీఐలు ఇమ్మాన్యుయల్ రాజు, అవతారం, పైడపు నాయుడు, ఉమామహేశ్వరరావు, ఆదాం, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి మొక్కలు సిద్ధం

బూర్జ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పరిశోధనా స్థానం పెద్దపేటలో దేశవాలీ రకమైన ఈస్ట్‌కోస్ట్ టాల్ రకం కొబ్బరి మొక్కలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని సంబంధిత అధికారులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో కొబ్బరి మొక్క రూ.100 నిర్ణయించినట్టు తెలిపారు. కొబ్బరి మొక్కలు కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డు జిరాక్స్‌తో పరిశోధనా స్థానాన్ని సంప్రదించాలన్నారు.

ఇంకుడు గుంతల పనులు చేపట్టాలి

లావేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అన్నీ గ్రామ పంచాయతీల్లో ఇంకుడు గుంతలు పనులు చేపట్టాలని ఎంపీడీవో వెంకటరాజు తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష చేపట్టారు. ఉపాధి పథకం ద్వారా హార్టీకల్చర్, ఫారం పాండ్లు వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, అర్హులైన వారికి కొత్తగా జాబ్‌కార్డులను మంజూరు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఆర్.సత్యవతి, జేఈ లెలిన్‌బాబు, టీఏలు వెంకటరమణ, గౌరినాయుడు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ బృందం పరిశీలన

గుజరాతీపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బాల కార్మికులను నిర్మూలించేందుకు నగరంలోని నెహ్రూ రోడ్డులో వివిధ షాపులను జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం బుధవారం సందర్శించింది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు, లేబర్ ఆఫీసర్ శ్రీనివాసరావు సంయుక్తంగా నగరంలోని పలు చోట్ల సందర్శించారు. కార్యక్రమంలో న్యాయశాఖ, లేబర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలను బలోపేతం చేద్దాం

సరుబుజ్జిలి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల బలోపేతం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఇంటర్మీడియట్ జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి శివ్వాల తవిటినాయుడు తెలిపారు. కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు తెలిపారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నాగేంద్ర, అధ్యాపకులు శ్రీనివాసరావు, లైబ్రేరియన్ ఆకెళ్ల రామారావు పాల్గొన్నారు.

వ్యవసాయ కోర్సులతో భవిష్యత్

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో పలు కోర్సుకు ఉజ్వల భవిష్యత్ ఉందని, బాగా చదువుకుని సద్వినియోగం చేసుకోవాలని అసోసియేట్ డీన్ ఎం.భరతలక్ష్మి అన్నారు. నైర వ్యవసాయ కళాశాలలో నూతన విద్యా విధానంలో దీక్షారంబ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2024 విద్యా సంవత్సరంలో 200 మంది విద్యార్థులు ప్రవేశం పొందారని, ఈ కోర్సు విధానంపై అవగాహన కల్పించేందుకు దీక్షారంబ్ కార్యక్రమాన్ని ఈ నెల 23 నుంచి నవంబరు రెండో తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాగోలు, ఆమదాలవలస బోధన సిబ్బంది, అధిపతులు, కృషి విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరూపించలేకుంటే గుండు కొట్టించుకోండి

● మాజీ మంత్రి సీదిరికి ఎమ్మెల్యే గౌతు శిరీష సవాల్



మాట్లాడుతున్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

అరసవల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పలాసలో ఇద్దరు బాలికలపై జరిగిన అత్యాచారంపై మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని, ఆ వ్యాఖ్యలు నిజమని నిరూపించలేకపోతే గుండు కొట్టించుకోవాలని పలాస ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష సవాల్ విసిరారు. ఇటువంటి సున్నితమైన విషయాలపై కూడా ఇష్టమొచ్చినట్టు మాట్లాడడం దారుణమని మండిపడ్డారు. ఈ మేరకు ఆమె బుధవారం సాయంత్రం నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు నివాసంలో విలేకరులతో మాట్లాడారు. అఘాయిత్యం జరిగిన విషయం తెలుసుకుని, బాలికల తల్లికి ఫోన్ చేసి భరోసా కల్పించడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారని, కానీ సీదిరి అప్పలరాజు మాత్రం అందుకు విరుద్ధంగా పిచ్చిమాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. గతంలో జరిగిన హత్య కేసుల్లో నిందితులను కాపాడింది ఎవరో పలాసలో అందరికీ తెలుసన్నారు. మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణ వచ్చినందుకు కూటమి ప్రభుత్వం ఓ ఎమ్మెల్యేను సస్పెండ్ చేసింది. కానీ మీరేం చేశారు.. ఎమ్మెల్సీ అనంతబాబు, అంబటి రాంబాబు, గోరంట్ల మాధవ్ వంటి వారిపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు పూర్తి రక్షణ ఉందన్నారు. మెండ దాసునాయుడు, పీరుకట్ల విఠలరావు పాల్గొన్నారు.

న్యాయ కోర్సులో ప్రవేశాలకు బీసీఐ అనుమతి



వీసీకి బీసీఐ అనుమతి పత్రాలు అందిస్తున్న లా కోర్సు కోఆర్డినేటర్ తదితరులు

ఎచ్చెర్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని న్యాయ కోర్సులో 2024-25 సంవత్సరంలో ప్రవేశాలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) అనుమతి లభించింది. బీసీఐకి వార్షిక ధ్రువపత్రాలు, రెన్యువల్ ఫీజు, గ్యారెంటీ ఫీజు సకాలంలో చెల్లింపుతో సంతృప్తి చెంది ప్రవేశాలకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు అందిన సమాచార పత్రాన్ని వర్సిటీ వీసీ కేఆర్ రజనికి బుధవారం వర్సిటీ లా విభాగం కోఆర్డినేటర్ వై.రాజేంద్రప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ బి.అడ్డయ్య, లా అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మకంగా ఆలోచిస్తేనే సత్ఫలితం

ఎచ్చెర్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రయోగాత్మకంగా ఆలోచిస్తేనే సత్ఫలితం చేకూరుతుందని, ఆ దిశగా విద్యార్థులు కృషి చేయాలని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త ఎన్.బాలాజీ అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో బుధవారం జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఈ ప్రదర్శనలో తొమ్మిది గురుకుల పాఠశాలల నుంచి సైన్స్, మేథ్స్, సోషల్ స్టడీస్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ విభాగాల్లో మొత్తం 140 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. వీటి నుంచి సీనియర్, జూనియర్ విభాగాల్లో మొత్తం 20 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. వీరంతా ఈ నెల 28, 29 తేదీల్లో విశాఖలో జరగనున్న జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, ఆర్ఐవో పి.దుర్గారావు, ఎంఈవో కారు పున్నయ్య, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ, కొల్లివలస ప్రిన్సిపాల్ డి.దేవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నందెన్న ఉత్సవాలు



ఊరేగింపులో పాల్గొన్న చిన్నారులు, భక్తులు

కవిటి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కవిటి, గొండ్యాల పుట్టుగ, ప్రగడ పుట్టుగ తదితర గ్రామాల్లో నందెమ్మ ఉత్సవాలు ముగింపు కార్యక్రమాలు బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గౌరీ పౌర్ణమి నుంచి ఆయా గ్రామాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

జీఎన్ఎం కోర్సుల్లో ప్రవేశానికి గడువు పెంపు

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హెల్త్ కేర్ రంగానికి సంబంధించిన జీఎన్ఎం కోర్సుల్లో అడ్మిషన్ చేసుకునేందుకు ఈ నెల 25వ తేదీ వరకు అవకాశం కల్పించినట్టు బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంస్థ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులన్నారు. కోర్సు పూర్తిచేసిన తర్వాత ఉద్యోగ అవకాశం కల్పించి.. ఫీజు చెల్లించుకునే వెసులుబాటు కల్పిస్తామని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు బొల్లినేని మెడ్‌స్కిల్స్, జెమ్స్ ఆసుపత్రి ప్రాంగణం(రాగోలు)లో సంప్రదించాలన్నారు. లేకుంటే 76809 45357, 79950 13422 ఫోన్ నెంబర్లలో సమాచారం తెలుసుకోవచ్చని చెప్పారు.

ఏకాగ్రతతోనే క్రీడల్లో రాణింపు

● ముగిసిన రాష్ట్రస్థాయి సపక్ తక్రా పోటీలు



హోరాహోరీగా సాగుతున్న బాలుర ఫైనల్ మ్యాచ్

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు ఏకాగ్రతతోనే రాణిస్తారని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ధర్మాన కృష్ణ దాస్ అన్నారు. స్థానిక ఏడు రోడ్ల జంక్షన్‌లో గల ఎన్టీఆర్ మున్సిపల్ పాఠశాల మైదానంలో గత రెండు రోజులు నుంచి జరుగుతున్న రాష్ట్ర స్థాయి సపక్ తక్రా బాలురు, బాలికల చాంపియన్‌షిప్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు బాలుర విభాగం ఫైనల్స్‌లో కర్నూలు, కోనసీమ జిల్లాలకు చెందిన క్రీడాకారులతో కృష్ణదాస్, జిల్లా సపక్ తక్రా గౌరవాధ్యక్షుడు ఎంఎస్ఆర్ కృష్ణమూర్తి తదితరులు పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి, జిల్లా సపక్ తక్రా సంఘం అధ్యక్షుడు ఎం.స్వరూప్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, రాష్ట్ర బాక్సింగ్ సంఘం కార్యదర్శి లక్ష్మణ్‌దేవ్, ఎన్‌సీఎస్ డైరెక్టర్ పి.శ్రీకాంత్, సంఘం ప్రధాన కార్యదర్శి జి.అర్జున్ రెడ్డి, ప్రతినిధులు జీవీ ము రళీకృష్ణ, పీఎస్ శ్రీనివాసరావు, బి.శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లా బాలికల జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. ద్వితీయస్థానంలో తూర్పుగోదావరి, మూడో స్థానంలో కర్నూలు, ప్రకాశం జట్లు నిలిచాయి. అలాగే బాలుర విభాగంలో కర్నూలు ప్రథమ స్థానం, అంబేడ్కర్ కోనసీమ జట్టు ద్వితీయ స్థానం, శ్రీకాకుళం, ప్రకాశం జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రణస్థలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ముంచుకొస్తున్న దాన తుఫాన్ నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి ఐవీ రమణ అన్నారు. బుధవారం తీరప్రాంత గ్రామం కోటపాలెంలో ఆయన పర్యటించారు. విజయరామ చెరువు ఆనకట్టను పరిశీలించారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందుస్తుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. పడవలు, వలలు సురక్షిత ప్రాంతాలకు చేర్చుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

● ఇచ్ఛాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి, ఏపీడీ చల్లా శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, వీఆర్వోలు, సెక్రటరీలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్స్‌తో సమావేశం నిర్వహించారు.

● జి.సిగడాం, అక్టోబరు 23(ఆంధ్రజోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఏర్పడిన తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి రాజేంద్రప్రసాద్ బాబు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాయలంలో వివిధ శాఖల అధికారుల ఆయన సమీక్షించారు. ఎంపీడీవో రామకృష్ణ, వైద్యాధికారి సుమబిందు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

రక్తదానం శిబిరం

అరసవల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సినీ హీరో ప్రభాస్ అభిమానులు నగరంలోని రెడ్‌క్రాస్ భవనంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది రక్తదానం చేశారు. శ్రీకాకుళం నియోజకవర్గం టీడీపీ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావు, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డి గిరిజాశంకర్, ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, సెక్రటరీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గారలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ రేపు

గార, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్.రమణారావు, ఎంపీడీవో ఎస్.రామమోహనరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెవెన్యూ ఇతర సమస్యలపై ఈ ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అభ్యంతరాలుంటే తెలపండి

గుజరాతీపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన బోధన సిబ్బంది, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన బోధనేతర సిబ్బందికు గాను 1:20 నిష్పత్తిలో ధ్రువ పత్రాలు పరిశీలించడమైనదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. సర్టిఫికేట్ల పరిశీలన అనంతరం జాబితాను కార్యాలయం నోటీసు బోర్డులో పొందపర్చడమైనదని, అభ్యర్థులు జాబితాలో ఎటువంటి అభ్యంతరాలున్నా ఈ నెల 24వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా జిల్లా ప్రాజెక్టు కార్యాలయం, సమగ్ర శిక్ష శ్రీకాకుళం దృష్టికి తీసుకురావాలన్నారు.

ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

రణస్థలం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాథరావు అన్నారు. బుధవారం వల్లభరావుపేటలో వ్యవసాయశాఖ పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. పంట మార్పిడి విధానాన్ని అమలు చేయాలని, భూసార పరీక్షలు విధిగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసరావు, ఏవో విజయ్‌భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి కొళాయి ఏర్పాటు

పొందూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారిణి బి.జ్యోత్స్న ఆదేశాలతో మండల కేంద్రంలోని బాలికల పోస్టుమెట్రిక్ వసతిగృహంలో తాగునీటి కొళాయిని పంచాయతీ ఈవో మోహన్‌బాబు ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల కిందట ఈ వసతి గృహాన్ని న్యాయాధికారిణి పరిశీలించారు. తాగునీటికి ఇబ్బంది పడుతున్నట్టు విద్యార్థులు న్యాయాధికారిణి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అక్కడి నుంచే ఫోన్‌లో ఈవో మోహనుబాబుతో మాట్లాడి తక్షణమే ఈ సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

ఆధార్ సేవలు వినియోగించుకోండి

జి.సిగడాం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల సచివాలయంలో నిర్వహించిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మండలంలో నాలుగు ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డీఏ పొగిరి రాము, సిబ్బంది సాహూ, పొట్నూరు సురేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

బడి బయట పిల్లలను గుర్తించాలి

ఇచ్ఛాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బడి బయట పిల్లలను గుర్తించి బడుల్లో చేర్పించాలని పాఠశాల విద్యా కమిషనర్ విజయ రామరాజు హెచ్ఎంలకు సూచించారు. బుధవారం మండల విద్యాశాఖ కేంద్రంలో మండల ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఎంఆర్సీ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో కూరమాన అప్పారావు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్

అరసవల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ప్రిన్సిపల్ కమిషనర్, ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్-1 బి.శ్రీనివాస్(ఐఆర్ఎస్) బుధవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ ఈవో వై.భద్రాజీ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచార్యులు, అర్చకులు రంజిత్‌శర్మ, సాందీపశర్మ, షణ్ముఖశర్మ పాల్గొన్నారు.

సమన్వయంతో విధులు నిర్వహించాలి

ఆమదాలవలస, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి సిబ్బంది మండల, క్షేత్రస్థాయిలో సమన్వయంతో విధులు నిర్వహించాలని డ్వామా పీడీ బి.సుధాకరరావు సూచించారు. బుధవారం మండల కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సిబ్బంది పనితీరుపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవన్నారు. ప్లాంటేషన్ పనులను వేగవంతం చేయాలన్నారు. వ్యక్తిగత తోటల పెంపకంపై రైతులకు అవగాహన తేవాలన్నారు. సమావేశంలో ఏపీవో అప్పలనరసమ్మ, ఈజీ జి.రాము, టెక్నికల్ అసిస్టెంట్లు సత్యనారాయణ, సుధాకర్, క్షేత్ర సహాయకులు, ఇతర ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సరైన మోతాదులో ఎరువులు వాడాలి



గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పంటలు పండించే రైతులు సరైన మోతాదులో ఎరువులు వాడడంతోనే మంచి దిగుబడి సాధ్యమవుతుందని ఏడీఏ జగన్మోహన్ అన్నారు. బుధవారం తేలుకుంచి, డొంకూరు గ్రామాల్లో ఏడీఏ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పి.రాజశేఖర్‌రెడ్డి, ఏవో టి.భార్గవి, హార్టికల్చర్ అధికారులు, టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ మేరుగు సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

తుఫాన్‌పై అప్రమత్తం చేశాం

● తహసీల్దార్ మధుసూదన్



సరుబుజ్జిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజలను అలజడి సృష్టిస్తున్న దాన తుఫాన్‌పై మండలంలోని ప్రజలను, రైతులను అప్రమత్తం చేసినట్టు తహసీల్దార్ ఎల్.మధుసూదన్ తెలిపారు.

ప్రశ్న: ముందస్తు చర్యలు చేపట్టరా?

జవాబు: మండలంలోని వంశధార నదీ పరివాహక ప్రాంతంలో క్షేత్రస్థాయి అధికారులు అందుబాటులో ఉంచాం.

ప్ర: రైతులకు సూచనలు చేశారా?

జ: అన్ని గ్రామాల్లో ఎప్పటికప్పుడు తుపాన్ తీవ్రతను వివరిస్తూ వరి కోతలు చేయొద్దని వీఆర్ఏల ద్వారా దండోరా వేయించాం.

ప్ర: లోతట్టు ప్రాంతల పరిస్థితి?

జ: వంశధార నదిని ఆనుకొని ఉన్న లోతట్టు గ్రామాల ప్రజలకు తుపాన్ ప్రభావంతో ఇబ్బంది లేకుండా గ్రామ సచివాలయాల్లో పునరావాసం కల్పించడానికి ఆదేశాలిచ్చాం.

ప్ర: ఏ శాఖల అధికారులు అందుబాటులో ఉంటున్నారు

జ: తుఫాన్ విధుల్లో భాగంగా గ్రామ రెవెన్యూ గ్రామ సచివాలయ పంచాయతీరాజ్ వ్యవసాయ విద్యుత్‌శాఖ అధికారులను ఆయా గ్రామాల్లో విధుల్లో నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చాం.

ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నిక

అరసవల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం శ్రీకాకుళం జిల్లా ఎన్నిక బుధవారం రిమ్స్ ఆసుపత్రిలో ఏకగ్రీవంగా జరిగింది. మూడేళ్ల కాలానికి నిర్వహించిన ఎన్నికకు కె.దామోదరరావు, పి.జానకిరామ్, డివిజనల్ కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షురాలిగా పి.శాంతి కుమారి, ఉపాధ్యక్షురాలిగా ఎల్.త్రినాథమ్మ, కోశాధికారిగా పి.సత్యవతి, సభ్యులుగా టి.బేబి, ఐ.కుసుమ కుమారి, టి.చంద్రకళ, పి.జగదాంబ, నిర్మల ఎన్నికయ్యారు.

చిన్న గ్రామం.. సమస్యల వలయం

● ఇదీ సొగిడియా దుస్థితి

పలాసరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పలాస మండలం కేదారిపురం పంచాయతీలో అతి చిన్న గ్రామం సొగిడియా.. గ్రామంలో ఎటు చూసినా సమస్యలే దర్శనమిస్తాయి. వీటిని పరిష్కరించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి వాహనచోదకులు, ప్రజలు రాక పోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే వర్షాకాలం.. పిచ్చి మొక్కలు తొలగించకపోవడంతో పాముల బెడదతో పాటు ఎదురెదురుగా వాహనాలు వచ్చే సమయంలో తప్పించుకునేందుకు ఇక్కట్లకు గురవ్వాల్సి వస్తోందని వాహనదారులు పేర్కొంటు న్నారు. గ్రామంలో ఉన్న ఎకైక నీటి ట్యాంకు వద్ద ఏర్పాటు చేసిన కొళాయిలకు హెడ్‌లు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. ట్యాంకు వద్ద పారిశుధ్య లోపంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలో బ్లీచింగ్ జల్లడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వీధిలోని రెండు లైట్లు వెలగక పోవడంతో రాత్రి పూజ తిరిగేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువల్లోని చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించాలని, రోడ్ల నిర్మాణం చేపట్టాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


సొగిడియా గ్రామానికి వెళ్లే మార్గంలో ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు


ట్యాంకు వద్ద హెడ్‌లు లేని కొళాయిలు.. చుట్టూ పారిశుధ్య లోపం

క్రైం కార్నర్

అల్లర్లకు పాల్పడిన ఇద్దరి అరెస్టు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో అల్లర్లకు పాల్పడిన ఓ రౌడీషీటర్‌తో పాటు మరో వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగర పరిధి దమ్మలవీధిలో మంగళవారం రాత్రి మద్యం మత్తులో రౌడీషీటర్ వండాన ఢిల్లీశ్వరరావు అలియాస్ ఢిల్లీ అనే వ్యక్తి స్థానికులతో గొడవపడడంతో అక్కడి ప్రజలు 112కి ఫిర్యాదు చేశారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని రౌడీషీటర్ ఢిల్లీని స్టేషన్‌కు తీసుకువచ్చి అతడిపై ఎస్‌ఐ హరికృష్ణ కేసు నమోదు చేశారు. అలాగే నగరంలోని బాకర్‌సాహెబ్‌పేటకు చెందిన బద్రి త్రినాథ రావు కూడా మద్యం తాగి వీధిలో అల్లర్లు సృష్టించడంతో స్థానికులు 112కి ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని త్రినాథరావును స్టేషన్‌కు తరలించి అతడిపై ఎస్‌ఐ హరికృష్ణ కేసు నమోదు చేశారు. వీరిద్దరిని బుధవారం పోలీసులు కోర్టులో హాజరుపరచగా.. 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

నాకు ప్రాణహాని ఉంది

● వీడియో విడుదల చేసిన సనపల సురేష్

బూర్జ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే కూన రవికుమార్ వల్ల నాకు ప్రాణహాని ఉందని గత ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి స్వతంత్ర్య అభ్యర్థి పోటీ చేసిన సనపల సురేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. నేను మొదటి నుంచి ఇసుకపై పోరాటం చేస్తున్నానని, అక్రమంగా తనను అరెస్టు చేయిస్తున్నారన్నారు. కాఖండ్యాం ఇసుక ర్యాంప్‌లో జరుగుతున్న అక్రమాలపై గనులు, మైన్స్, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశానని, దీంతో నాపై టీడీపీ నాయకులు దాడులు చేస్తున్నారన్నారు. ఈనెల 16న జరిగిన హత్యాయత్నానికి ఎమ్మెల్యే కూన రవికుమారే ముఖ్యకారణమని, అతని నుంచి ప్రాణహాని ఉందన్నారు.

వివాహం నిశ్చయమై.. ఇంతలోనే

● విద్యుదాఘాతంతో యువకుడి మృతి


లక్ష్మణరావు (ఫైల్)

ఆమదాలవలస, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం మండలం పొన్నాంపేట గ్రామానికి చెందిన కర్రి లక్ష్మణ రావు(24) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తోటి కార్మికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మణ్ బుధ వారం ఉదయం పనిచేసేందుకు గాజులకొల్లివలసలోని జగనన్న కాలనీలో భవన నిర్మాణ పనులకు వెళ్లాడు. నీటి కోసం మోటార్ వేసేందుకు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి అమర్చి న ప్లగ్‌బాక్స్‌లో వైర్లు అమర్చే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటివరకు అందరితో కలిసిమెలిసి ఉన్న లక్ష్మణ్.. మృతి చెందడంతో తోటి కార్మికులు రోదించారు. కుమారుడి మరణవార్త తెలుసు కున్న తల్లిదండ్రులు సిమ్మయ్య, ఆదిలక్ష్మి రోదన వర్ణనాతీతం. లక్ష్మణకు ఇద్దరు సోదరులున్నారు. ఇదిలా ఉండగా లక్ష్మణ్‌కు ఇటీవలే వివాహం నిశ్చయమైందని, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పెళ్లి జరగాల్సి ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంతలోనే మృతి చెందడంపై కన్నీరుమున్నీరవుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఏఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి యువకుడు..

ఇచ్ఛాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వెస్ట్‌బెంగాల్ ముర్షిదాబాద్‌కు చెందిన సంతు కర్మాకర్(24) మంగళవారం రాత్రి ఇచ్ఛాపురం రైలు నిలయం సమీపంలో గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్టు పలాస జీఆర్పీ ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. స్థానిక రైల్వే సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు.

గుండెపోటుతో వలసకూలీ మృతి


గణపతిరావు (ఫైల్)

టెక్కలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): లింగాలవలస పంచాయతీ సార్లిగాం గ్రామానికి చెందిన కూన గణపతి రావు(40) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. గణపతిరావు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో పెయింటింగ్ వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతదేహాన్ని గురువారం గ్రామానికి తీసుకు రాను న్నట్లు గ్రామస్థులు తెలిపారు. గణపతిరావు మృతిపై కుటుంబ సభ్యులు విలపి స్తున్నారు. ఈయనకు భార్య హేమలతతో పాటు ఇద్దరు పిల్లలున్నారు.

అరమవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం: డీఎస్పీ


మాట్లాడుతున్న ఏపీఎస్పీ డీఎస్పీ చంద్రశేఖర్

సంతబొమ్మాళి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని ఏపీఎస్పీ డీఎస్పీ చంద్రశేఖర్ అన్నారు. దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీఎస్పీ 5వ బెటాలియన్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు పొందల లక్ష్మణరావు, పొందల కృష్ణారావు నక్సలైట్లతో పోరాడి వీరమరణం పొందారన్నారు. వారిని స్మరించుకుంటూ ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శివప్రసాద్, ఇన్‌చార్జి హెచ్‌ఎం వీరభద్ర రావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

టెక్కలి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టిగోవిందమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఎర్రన్నాయుడు మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరి రక్షణ, సంఘవిద్రోహ శక్తులను అణచి వేయడంలో ప్రాణాలర్పించిన వారిని స్మరించుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్, అధ్యాపకులు లీలాపద్మజ, కోటేశ్వరరావు, శ్రీనివాస్, శాంతన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక 80 అడుగుల రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరా లిలా ఉన్నాయి.. బుధవారం రాత్రి 7.40 గంటల సమయంలో నగరానికి చెందిన చాణుక్య (26) టీ తాగేందుకు 80 అడుగుల రోడ్డుకు వచ్చాడు. అక్కడ తనను కలిసిన స్నేహితుడి ద్విచక్ర వాహనం నడుపుతానని తీసుకుని అతివేగంగా వెళ్తూ కేంద్ర మంత్రి నివాసానికి సమీపంలో ఉన్న మలుపు వద్ద ఓ కారును ఢీ కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన చాణక్య అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ సీఐ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అన్నార్తులకు ‘అభయం’



భోజనం ప్యాకెట్లు అందిస్తున్న దృశ్యం

టెక్కలి, అక్టోబరు 23: ఆకలితో అలమటిస్తున్న అన్నార్తులకు 800 రోజులుగా ఆహారం అందిస్తున్నామని అభయం యువజన సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటి వరకు రూ.10 లక్షల దాతల సహకారంతో రోజూ రెండు పూటలా ఎటువంటి ఆసరా లేని వారికి ఆహారం అందిస్తున్నామన్నారు. దాతలు ముందుకు వస్తే వృద్ధులకు ఇంటి వద్దకే అన్నం ప్యాకెట్లు పంపించేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. సినీ నటుడు ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం అంధవరపు కిషోర్ అన్నదానం చేశారు. పలువురు సభ్యులు పాల్గొన్నారు.

రుణ బకాయిదారులకు నోటీసులు

పోలాకి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పోలాకి సహకార సొసైటీ ద్వారా గతంలో రుణాలు తీసుకున్న రైతుల నుంచి బకాయి వసూలుకై ముందస్తుగా నోటీసులు అందించినట్లు సొసైటీ ఇన్‌చార్జి ఎస్.పద్మావతి, సీఈవో బి.రాంబాబు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 750 మంది రైతుల నుంచి రూ.2.98 లక్షల బకాయి రావాల్సి ఉందన్నారు. ఇటీవల రూ.60 లక్షల పంటరుణాలు, రూ.50 లక్షల ఇతర రుణాలు రైతులకు అందచేశామన్నారు. పాతరుణాలను రెన్యువల్ చేయించుకోవాలన్నారు. కొత్తరుణాల కోసం సొసైటీకార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మహిళలపై దాడులు అరికట్టడంలో విఫలం

నరసన్నపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలపై హత్యాచారాలు, దాడులు, లైంగిక వేధింపులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కె. నాగమణి అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద నిరసన తెలిపారు. దేశవ్యాప్తంగా మహిళలపై అత్యాచారాలు, దాడులు అధికమవుతున్నాయని, ఒక ఘాతుకం మర్చిపోకముందే మరొకటి చోటుచేసుకుంటుండడంతో మహిళలు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇటువంటి ఘటనలకు కళ్లెం వేయాలన్నారు. నేతలు ఎ.రాధ, కాంతమ్మ, లక్ష్మి, జ్యోతి, నాగమణి పాల్గొన్నారు.

నిందితురాలి అరెస్టు

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పెద్దపాడు ఫ్లై ఓవర్ వద్ద బుధవారం సాయంత్రం వివిధ కేసుల్లో నిందితురాలైన మామిడి గౌతమిని అరెస్టు చేసినట్లు శ్రీకాకుళం రూరల్ ఎస్‌ఐ కె.రాము తెలిపారు. ఆమె నుంచి రెండు మొబైల్స్ ఒక లాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నరసన్నపేట మండలం కొత్తపోలవలసకి చెందిన గౌతమిపై రూరల్ స్టేషన్, టూటౌన్‌లో ఒక్కో కేసు ఉన్నాయన్నారు. తమకు వచ్చిన పక్కా సమాచారంతో ఆమెను అరెస్టు చేసినట్లు చెప్పారు.

కిశోర బాలికల సంఘాలను ఏర్పాటుచేయాలి

పాతపట్నం అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలని ఐసీపీఎస్ ఎం.మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. అనధికార దత్తతతో జరిగే నష్టాలు, పోస్టర్‌కేర్ స్పాన్సర్‌షిప్ పథకం, బాల్యవివాహాల నిషేధం, బాలల రక్షణ చట్టాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో టి.విమ లారాణి, సూపర్‌వైజర్లు డి.అమరావతి, జి.అనూ రాధ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎన్.రమేష్ నాయుడు తెలిపారు. చెప్పారు. ఉదయం 10 గంటలకు జరుగు సమావేశానికి పూర్తి సమాచారంతో అధికారులు హాజరు కావాలని కోరారు.

మృతుడి కుటుంబానికి రూ.1.65 లక్షల సాయం

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పూడి జగన్నాథపురం గ్రామానికి చెందిన తిమ్మల అప్పలస్వామి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి దాతలు రూ.1.65 లక్షల సాయాన్ని బుధవారం అందించారు. పిల్లల పేర సుకన్య సమృద్ధి పథకం బాండును అందజేశారు.

రైలు కింద పడి వ్యక్తి దుర్మరణం


శ్రీనివాసరావు (ఫైల్)

జలుమూరు, అక్టోబరు 23: (ఆంధ్రజ్యోతి): తిలారు రైల్వేగేటు సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రైలు ప్రమాదంలో పోలాకి మండలం ఈదుల వలసకి చెందిన కొర్ను శ్రీనివాసరావు (27) మృతి చెందాడు. ఆర్పీఎఫ్ ఎస్‌ఐ ఎం.మధుసూదనరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శ్రీకాకుళం నుంచి పలాస వెళ్లే మార్గంలో 730 మైలు రాయి వద్ద మృతదేహం లభ్యమైందన్నారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా ఈదులవలస గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరచినట్లు తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే గిరిజన గ్రామాల అభివృద్ధి


హరిపురం:శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

హరిపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గిరిజన గ్రామాల అభివృద్ధి సాధ్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. 'పల్లెపండగ'లో భాగంగా చిన్న కోష్ట, హరిపురం, జిల్లుండ, బీఎస్‌పురం, కృష్ణాపురంలలో సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో ఏ రోడ్డుకూ తట్టెడు మట్టి వేయలేదని విమర్శించారు. హరిపురంలో పశువుల ఆసుపత్రి భవన నిర్మాణం, చిన్న కోష్టకు ఆర్టీసీ సదుపాయం, కళింగదల్ నీటిని తరించేందుకు కాలువల నిర్మాణం తదితర సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యేకు వినతులు అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బావన దురోధన, దాసరి తాతారావు, రట్టి లింగరాజు, భాస్కరరావు, చంద్రశేఖర్, బైరిశెట్టి గున్నయ్య, వెంకట్, వాసు, సర్పంచ్ చింతాడ కావ్య, హరి పాల్గొన్నారు.

ముస్సిపాలిటీ అభివృద్ధికి కృషి

కాశీబుగ్గ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ అభివృద్ధే ధ్యేయ మని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం మున్సిపాలిటీ 6వవార్డు పెసరపాడులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. దశలవారీగా అన్ని వార్డుల్లోనూ పనులు చేపడతా మన్నారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగ రాజు, నేతలు లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

పలాసరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గానికి అదనంగా రూ.7.5 కోట్లు ఉపాధి నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి సమస్యలను వివ రించారు. పలాసలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని కోరారు. కాశీబుగ్గ ఆర్‌వోబీ పనులతో పాటు టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. వంశధార పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం


హాస్టల్ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

హిరమండలం,అక్టోబరు23:(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తు న్నామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. గొట్ట గ్రామంలో ప్రధానమంత్రి జన్‌మన్ హాస్టల్ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ.. రాష్ట్రానికి నాలుగు జన్‌మన్ హాస్టళ్లను కేంద్రం మంజూరు చేసిందని, వాటిలో రెండు పాత పట్నం నియోజకవర్గంలోనే ఏర్పాటు చేస్తాం దన్నారు. ఒక్కో హాస్టల్‌లో 50 మంది గిరిజన విద్యార్థులకు వసతి సదుపాయం కల్పించడం జరుగుతుం దని, వీటిని ఒక్కొక్కటి రూ.2.40 కోట్లతో ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు తూలుగు తిరుపతిరావు, టీడీపీ మండల అధ్యక్షుడు యాళ్ల నాగేశ్వరరావు, పలు శాఖల అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌ను వినియోగించుకోండి

ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని, దీనిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజాదర్బార్ నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని విమర్శించారు. భూ సమస్యలతో పాటు రోడ్లు, తాగు నీరు. రేషన్ కార్డులు, గృహాలు, నిర్వాసితుల సమస్యలపై వినతులు వచ్చాయి.

సమస్యలను పరిష్కరించండి

పాతపట్నం అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం నియోజకవర్గ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఉపాధి నిధులను పెంచాలని, కొత్తూరు మండలానికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మంజూరు చేయాలని కోరారు. పాతపట్నంలో బడిపిల్లల ఆటస్థలం కబ్జాకు గురైయిందని, తగు చర్యలు తీసుకోవాలన్నారు. వీటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని గోవిందరావు తెలిపారు.

ముమ్మరంగా సభ్యత్వ నమోదు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదుతోనే పార్టీ పటిష్టం అవుతుందని, ఈ ప్రక్రియను ముమ్మరంగా చేపట్టాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. చల్లవానిపేటలోని కల్యాణ మండపం, సారవకోట మండలం సవరడ్డపనస పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పార్టీలో ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందన్నారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతీ ఒక్క కార్యకర్తకు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. సమావేశంలో జలుమూరు, సారవకోట మండలాల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, కత్తిరి వెంకటరమణ, టీడీపీ రాష్ట్ర బీసీ కమిటీ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, నాయకులు బగ్గు అర్చన, పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ స్వామిబాబు, కింజరాపు సత్యం, బగ్గు గోవిందరావు, బైరి భాస్కరరావు, సురవరపు తిరుపతిరావు, సాధు చిన్నికృష్ణంనాయుడు, జయరాం పాల్గొన్నారు.

వైసీపీ నేతలది అవగాహన రాహిత్యం

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అన్ని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే వైసీపీ నేతలు అవగాహన రాహిత్యంగా మాట్లాడుతున్నారని, ఇవి తగవని టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, ఉపాధ్యక్షుడు అర్జవెల్లి ఉమామహేశ్వరరావు, రెయ్యిపాడు ఎంపీటీసీ సూళ్ల చిట్టి బాబు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరు లతో మాట్లాడుతూ.. బెండి పంచాయతీ మహదేవపురంలో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే గౌతు శిరీష భూమిపూజ మాత్రమే చేశారని, శిలాఫలకం ఏర్పాటు చేయకపోయినా శిలాఫలకంలో తన పేరు లేదని వైస్ ఎంపీపీ తమ్మినేని శ్రావణి ప్రకటనలివ్వడం అవగాహనా రాహిత్యానికి నిదర్శనమన్నారు. సమావేశంలో నాయకులు రాపాక శాంతారావు, కె.కృష్ణ, హేమసుందర్ ఉన్నారు.

మీ హయాంలో సెటిల్‌మెంట్లు గుర్తులేవా?



కాశీబుగ్గ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో మీరు చేపట్టిన సెటిల్‌మెంట్లు మీకు గుర్తు లేవా అని వజ్రపుకొత్తూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ హేంబాబు చౌదరి, తెలుగు యువత రాష్ట్ర నేత బుల్లోజు శశిభూషణ్ మాజీ మంత్రి అప్పలరాజును ప్రశ్నించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల పలాసలో బాలికలపై అఘాయిత్యం జరిగితే దోషులెవరైనా కఠినచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాలు జారీ చేస్తే మాజీ మంత్రి మాత్రం వక్రభాష్యం చెబుతూ ఆమె సెటిల్‌మెంటుకు పాల్పడుతున్నారని ఆరోపించడం దారుణమన్నారు.

పోర్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్సీ

టెక్కలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టు కోసం భూములిచ్చిన మూలపేట, విష్ణు చక్రం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. స్థానికులకే 75 శాతం ఉద్యోగా లివ్వాలని జగనన్న ప్రభుత్వం సంకల్పించిందని, అయితే పోర్టులో పనిచేస్తున్న మూలపేట, విష్ణుచక్రం గ్రామస్థులను తొలగించడం దారు ణమన్నారు. వారిని హింసించేందుకే రాజకీయం చేస్తారా అని ప్రశ్నించారు. మంత్రి అచ్చెన్నాయుడు ఐదు నెలలు ఆలస్యంగా పోరుకు కొబ్బరికాయ కొట్టారని, వాస్తవానికి ఈ పాటికే నిర్మాణం పూర్త య్యేదన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి ఐదు నెలలు జాప్యం చేశారని విమర్శించారు. పోర్టును ఎప్పుడు జాతికి అంకితం చేస్తారో చెప్పాలని కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కాశీబుగ్గ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పలాసలో ఇటీవల బాలికలపై జరిగిన అత్యాచార ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అధ్యక్ష, కార్యదర్శులు భాగ్యలక్ష్మి, ఢిల్లేశ్వరి కోరారు. ఈ మేరకు బాధితుల కుటుంబాలను బుధవారం పరామర్శించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

జలుమూరు, అక్టోబరు 23: (ఆంధ్రజ్యోతి) ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని సత్యసాయి సేవా సంస్థల ఆధ్యాత్మిక సమన్వయకర్త అనాధ గుప్త అన్నారు. అచ్యుతాపురంలో బుధవారం 100 గంటల అఖండ దివ్యానామ సంకీర్తనను ప్రారంభించారు. భక్తిభావం కలిగి ఉండడం వల్ల గ్రామాల్లో ఐక్యత కలుగుతుందన్నారు. మహిళా సేవాదల్ ఇన్‌చార్జి అమ్మయమ్మ, పలువురు సాయి భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయండి

నరసన్నపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు హెచ్‌ఎం నుంచి జిల్లా స్థాయిలో పర్యవేక్షణాధికారులు మరింత కృషి చేయాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం వెబెక్స్ ద్వారా హెచ్‌ఎం, ఎంఈవో, డీఈవో, ఆర్జేడీలతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల పుట్టిన తేదీల్లో మార్పులుంటే యాడైస్ చేయాలని అపార్‌ను వేగవంతం చేయాలన్నారు. నవంబరు 14న చిల్డ్రన్స్ డేలో తల్లులకు భాగస్వామ్యం చేయాలని, పాఠశాలలను అందంగా తయారు చేయాలని ఆయన సూచించారు. కాన్ఫరెన్స్‌లో ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం చేయండి

నరసన్నపేట, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌ను నవంబరు 14న నిర్వహించనున్నందున దీనిని విజయవంతం చేయాలని స్థానిక కోర్టు న్యాయాధికారి హరిప్రియ సూచించారు. బుధవారం కోర్టులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఇరుపార్టీల అంగీకారంలో రాజీ చేసేందుకు కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు జి.సత్యనారాయణ, జీవీజీ నాయుడు, జామి కామేశ్వరరావు, రెడ్డి జగన్నాథం, రావాడ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

● మున్సిపల్ కమిషనర్ రామారావు



పలాస, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ ఎన్.రామారావు అన్నారు.

ప్రశ్న: వేసవిలో తాగునీటికి పట్టణ వాసులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు కదా?

జవాబు: వాస్తవం. ఈ విషయమై ఇప్పటికే ఎమ్మెల్యే గౌతు శిరీషతో పాటు ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడాం. వేసవిలో నీటి ఇబ్బంది లేకుండా అవసరమైన చోట ట్యాంకర్లతో నీటి సరఫరాకు సిద్ధంగా ఉన్నాం.

ప్ర: సమగ్ర నీటి పథకానికి ఎప్పుడు అనుసంధానం చేస్తారా?

జ: ఈ విషయమై చర్చించాం. ఇరిగేషన్ శాఖ అనుమతి వెంటనే సమగ్రనీటి పథకంతో అనుసంధానం చేయనున్నాం.

ప్ర: చేసిన పనులకు బిల్లులివ్వడం లేదట కదా?

జ: చేపట్టిన పనులపై విజిలెన్స్‌కు ఫిర్యాదులు వస్తున్నాయి. దీనివల్ల పనులు ముందుకు సాగడం లేదు. దీనివల్లే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయం ఎమ్మెల్యే గౌతు శిరీష, మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లాం. త్వరితగతిన సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

న్యూస్ బాక్స్

ఎంఎంఎస్ కార్యవర్గ ఎన్నిక

పోలాకి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వెలుగు ఏపీఎం గోరు రాజారావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. అధ్యక్షురాలిగా కొయ్యాన వెంకటలక్ష్మి, కార్యదర్శిగా శిమ్మ లక్ష్మి, కోశాధికారిగా గొర్లె పార్వతి ఎంపికయ్యారన్నారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

నిరుపేద కుటుంబానికి సాయం

కోటబొమ్మాళి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీతన్నపేట గ్రామానికి చెందిన ఇప్పిలి త్రినాథ్ కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో కొత్తపేటకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంఘం సభ్యులు బుధవారం రూ.10 వేలు సాయమందించారు. ఆయన వైద్య ఖర్చుల కోసం ఈ మొత్తం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతి నిధులు రాజు, రవి, సంతు తదితరులు పాల్గొన్నారు.

టీపీవోగా వరప్రసాదరావు

పలాస, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి (టీపీవో)గా ఎస్.వరప్రసాదరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖ నగర పాలకసంస్థ నుంచి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ రామారావును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

పలాస, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరిస్తామని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. ఈ మేరకు మునిసిపల్ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక మంది లబ్ధిదారులు గృహ నిర్మాణంపై ఫిర్యాదులు చేశారు. ఎమ్మెల్యే శిరీష సూచనల మేరకు ప్రతి బుధవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు.

చదువుపై శ్రద్ధ వహించాలి

హిరమండలం,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి మంచి ప్రతిభ కనబరచాలని డీఈవీవో శివ్వాల తవిటినాయుడు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ కళాశాలను సందర్శించారు. శత శాతం ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు. ప్రిన్సిపాల్ పీఈఎస్ పట్నాయక్ ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కోటబొమ్మాళి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డయేరియా, టైఫాయిడ్ వ్యాధులు ప్రబలుతున్నందున వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ టి.శ్రీకాంత్ అన్నారు. బుధవారం కొత్తపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు.